సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం ၊ 11 ၊ మార్చి ၊ 2024



పదోన్నతులపై హర్షాతిరేకాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 21 మంది వీఆర్ఓలకు పదోన్నతులు కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



కనుల పండువగా రథోత్సవం

బలివేలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఉత్సవ అధికారులు తెలిపారు. 8లో



బ్యాండ్ బాజా బారాత్

బ్యాగ్ పైప్ బ్యాండ్‌లో తాడేపల్లిగూడెం గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. రెండు సార్లు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలోకి ఆటో కార్మికులు



పాలకొల్లులో ఆటో కార్మికులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాలకు చెందిన ఆటో కార్మికులు గోపి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు రూ.10 వేల చొప్పున ఏటా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జగన్‌ను మరోమారు ఎన్నుకుంటే పథకాలన్నీ యథావిధిగా అందుతాయన్నారు. ముందుగా ఆటో కార్మికులకు పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు. నాయకులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం



భీమవరం (ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమగుండం చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై ఉత్సవమూర్తులు వేంచేపు చేసి బాణసంచా కాల్పుల నడుమ తెప్పోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ రెడ్డి రామకృష్ణంరాజు, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి పెద్దింట్లమ్మ జాతర



కైకలూరు: కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ వారి జాతర (తీర్థం) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఉదయం 7.30 గంటలకు జాతర ప్రారంభిస్తారని ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు ఆదివారం తెలిపారు. ఈనెల 24 వరకు జాతర జరుగుతుందని, రోజూ అమ్మవారికి పంచహారతులు అందిస్తామన్నారు. జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని చెప్పారు.



ఇరగవరం మండలం కావలిపురం జగనన్న కాలనీలో..



తణుకు ఆర్డీవో కార్యాలయం ప్రాంతంలో..



పాలకోడేరు మండలం మోగల్లు జగనన్న కాలనీలో..

ఇవిగో.. జగనన్న ఊళ్లు



తమకంటూ సొంత గూడు ఉండాలని ప్రతి పేద కుటుంబం కలలు కంటుంది.. ఆర్థిక ఇబ్బందులతో అద్దె ఇళ్లల్లోనే అవస్థల జీవనం గడపాల్సి వస్తుంది..

పేదల సొంతింటి ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లితే.. లక్షలాది పక్కా ఇళ్ల నిర్మాణంతో దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 779 జగనన్న లే అవుట్లలో 76,069 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటిలో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. పలు జగనన్న కాలనీలు వందల సంఖ్యలో ఇళ్లతో కొత్త ఊళ్లుగా రూపాంతరం చెందుతున్నాయి. వందల కోట్ల వ్యయంతో గేటెడ్ కమ్యూనిటీలకు ధీటుగా ఆయా కాలనీల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– సాక్షి, భీమవరం



తణుకు మండలం దువ్వ గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్లు



పెనుమంట్ర మండలం మార్టేరు జగనన్న కాలనీలో..



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం జగనన్న కాలనీలో..

పేదల సొంతింటి కల సాకారం

- పెద్దఎత్తున గృహ నిర్మాణాలు
- 779 లేఅవుట్లు.. 76 వేల ఇళ్ల స్థలాలు
- కొత్త గ్రామాలుగా మారిన జగనన్న కాలనీలు

జిల్లాలో గృహ నిర్మాణం

ఇళ్ల మంజూరు	ప్రభుత్వ సాయం (ఒక్కో ఇంటికి)
71,283	రూ. 1.80 లక్షలు
పూర్తయిన ఇళ్లు	**మొత్తం నిర్మాణ వ్యయం**
28,608	రూ. 1,283.09 కోట్లు
ఇప్పటివరకు అందించిన సాయం	రూ. 562.10 కోట్లు

స్థలంపై పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది



ఆకివీడు మండలం కుప్పనపూడి జగనన్న కాలనీలో..



కాళ్ల మండలం కోపల్లె జగనన్న కాలనీలో..



తణుకు మండలం వేల్పూరు జగనన్న కాలనీలో..

దేవదాయ శాఖలో సువర్ణాధ్యాయం



తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర దేవదాయ శాఖ చరిత్రలో జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని వక్తలు కొనియాడారు. గత రెండేళ్లలో దేవదాయ శాఖ కొత్త రూపును సంతరించుకుందన్నారు. ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు తాడేపల్లిగూడెంలో జరిగిన ధర్మప్రచార మహోత్సవాలు ముగిసిన సందర్భంగా దేవదాయ శాఖ ఉద్యోగులు ఆదివారం బలుసులమ్మవారి కల్యాణ మండపంలో ఆత్మీయ సభ నిర్వహించారు. ధార్మిక పరిషత్ కో–ఆర్డినేటర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దైవానుగ్రహంతో సీఎం జగన్ తనకు అప్పగించిన దేవదాయశాఖ మంత్రి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించామన్నారు. రెండేళ్లలో పలు కార్యక్రమాలు చేపట్టగలిగామని, దేవదాయ శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేశామన్నారు. వేల కోట్ల విలువైన దేవదాయశాఖ స్థిరాస్తులను పరిరక్షించేందుకు చట్టసవరణ చేయగలిగామన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రధానాలయాలను బృహత్ ప్రణాళికలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది భాగస్వాములేనని అన్నారు.

చరిత్రాత్మక నిర్ణయాలతో..

దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ మంత్రిగా కొట్టు చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని, విజయవాడలో మహాయజ్ఞం నిర్వహించామన్నారు. 14 ఏళ్లుగా వాయిదా పడుతున్న శ్రీశైలం మహా కుంభాభిషేకాన్ని నిర్వహించిన ఘనత మంత్రి కొట్టుకే దక్కుతుందన్నారు. అర్చకులకు నో రిటైర్మెంట్ విధానం ద్వారా రాష్ట్రంలో 1,142 మందికి మేలు జరిగిందన్నారు. రూ.712 కోట్లతో ప్రధాన ఆలయాలను మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించారన్నారు.

70 ఏళ్ల చరిత్రలో..

జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ 70 ఏళ్ల చరిత్రలో ఎవరూ చేయని విధంగా రూ.లక్ష కోట్ల విలువైన హాథీరాంజీ మఠం ఆస్తులను ప్రభుత్వం కాపాడిందన్నారు. ఒకేసారి 46 మందికి డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతులు కల్పించడం అద్భుతమన్నారు. రాష్ట్రంలో 5 వేల ఆలయాల్లో నిత్యం దీపధూప నైవేద్యాలను నిర్వహించేందుకు ప్రత్యేక స్కీమును తీసుకువచ్చిన ఘనత మంత్రి కొట్టుకే దక్కిందన్నారు. ముందుగా మంత్రి కొట్టుకు ఘన స్వాగతం పలికారు. గజమాలతో ఆయన్ను సత్కరించి ఆయా ఆలయాలు స్వామివార్ల చిత్రపటాలను అందజేశారు.

యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

కైకలూరు: అఖిల భారతీయ యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా కైకలూరు మండలం ఆచవరం గ్రామానికి చెందిన బూరుబోయిన శ్రీనివాసరావు (బీఎస్సార్)ను నియమించారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అందజేశారు. యాదవులు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు, టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు నాగసత్యం, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పలువురు ప్రముఖులు హాజరయ్యారని బీఎస్సార్ చెప్పారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

వైఎస్సార్ చేయూత సభలో మంత్రి కారుమూరి



తణుకులో చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తణుకు అర్బన్: రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలన్నీ వారి పేరుపై అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఆదివారం తణుకు నియోజవర్గ పరిధిలో వైఎస్సార్ చేయూత 4వ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలందరికీ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేల చొప్పున అందజేశారని, వారంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. పేద బిడ్డల ఉన్నత చదువులే లక్ష్యంగా అమ్మఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కట్టకట్టుకుని సీఎం జగన్‌పై పోరాటానికి వస్తున్నాయని, పెత్తందార్లకు పేదల పక్షాన నిలిచిన జగన్ మధ్య జరిగే యుద్ధానికి అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

భారీగా నిధులు

పేదల సౌకర్యార్థం విద్య, వైద్యానికి సీఎం జగన్ భారీగా నిధులు కేటాయించారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులో సమస్యలను సత్వరమే పరిష్కరించే సత్తా మంత్రి కారుమూరికి మాత్రమే ఉందన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

జగనన్నను మరోమారు సీఎం చేద్దాం

58 నెలల కాలంలో సంక్షేమం పేరుతో మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు బదిలీ చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన జగనన్న ప్రభుత్వాన్ని మరలా తెచ్చుకునేందుకు మహిళలంతా కృషి చేయాలని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పిలుపునిచ్చారు. సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన బీసీ మహిళగా తనను గుర్తించి ఎంపీ సీటు ఇచ్చారని చెప్పేందుకు గర్వపడుతున్నానన్నారు. అనంతరం చేయూత చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో వేలాదిగా మహిళలు తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎంపీడీఓలు డి.శ్రీలలిత, పద్మజ్యోతి, రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్‌లు నత్తా కృష్ణవేణి, బుద్దరాతి భరణిప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, తణుకు పట్టణ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, జేసీఎస్ అత్తిలి కన్వీనర్ పెన్మెత్స రామరాజు, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు పాల్గొన్నారు.



సభకు హాజరైన లబ్ధిదారులు

క్లుప్తంగా

అందే సత్యం సంస్మరణ సభ

అత్తిలి: జిల్లా పరిషత్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ అందే సత్యనారాయణ సంస్మరణ కార్యక్రమం మండలంలోని స్కిన్నెరపురం గ్రామంలో ఆదివారం జరిగింది. అందే సత్యనారాయణ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందే సత్యం గ్రామానికి చేసిన సేవలను శ్లాఘించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు చీర్ల రాధయ్య, టీటీడీ మాజీ సభ్యుడు నాచు శేషగిరిరావు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, న్యాయవాది మాకా శ్రీనివాసరావు, బీఆర్ కళాపరిషత్ నిర్వాహకుడు బుద్దాల వెంకట రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

టి.నరసాపురం: పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీరామవరంలో శనివారం జరిగింది. ఈ ఘటనపై ఆదివారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కునూరు మండలం దాచారం గ్రామానికి చెందిన వర్సా లక్ష్మి, సుబ్బయ్య దంపతులు గత ఇరవయ్యేళ్లుగా శ్రీరామవరంలో నివాసం ఉంటున్నారు. లక్ష్మి శనివారం జీడితోటలోకి చెట్ల కింద ఆకులు శుభ్రం చేసే పనికి వెళ్లింది. పని చేస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో ఆమెను వెంటనే చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి భర్త సుబ్బయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పదోన్నతులపై హర్షాతిరేకాలు

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 21 మంది వీఆర్‌ఓలకు ప్రమోషన్
- కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వీఆర్‌ఓలు



వీఆర్‌ఓలకు పదోన్నతి ఉత్తర్వులు ఇస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): వీఆర్‌ఓలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 21 మంది వీఆర్‌ఓలు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు పొందారు. వీరందరికీ ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఇటీవల నియామక పత్రాలు అందజేశారు. పదోన్నతులు, కారుణ్య నియామకాల కోసం ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్న వీఆర్వోలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర చేసిన సమయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. దానిని గుర్తుపెట్టుకున్న సీఎం వైఎస్ జగన్ తాజాగా వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో నంబర్ 154 విడుదల చేసింది. దీంతో జిల్లా అధికారులు వారికి నియామక పత్రాలను అందించారు. దీనిపై వీఆర్వోల సంఘ నాయకులు స్పందిస్తూ.. పదోన్నతుల కల్పన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యపై సానుకూలంగా స్పందించి నియామకాలు ఇవ్వడంపై వారు సంబరాలు చేసుకుంటున్నారు.

కారుణ్య నియామకం చేపట్టడంపై సంబరం

వీఆర్‌ఓలకు సంబంధించి కారుణ్య నియామాలకు సైతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వీఆర్‌ఓలు సంబరాలు చేసుకుంటున్నారు. ఆకివీడు మండలంలో పనిచేస్తూ గుండెపోటుతో మరణించిన వీఆర్‌ఓ కుమారుడు కడిమి కిరణ్‌ని ఇటీవల ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా నియమిస్తూ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు ఇవ్వడంపై వీఆర్వో సంఘ నాయకులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



పెంటపాడు మండలం అలంపురంలో వీఆర్‌ఓగా పనిచేసే నేను పదోన్నతుల కల్పనతో ఏలూరు అర్బన్ మండలంలో సీనియర్ సహాయకుడిగా నియమితుడినయ్యాను. పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– ఎస్.ప్రభువరం, సీనియర్ సహాయకుడు, ఏలూరు అర్బన్ మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వానికీ మా సమస్యలు మొరపెట్టుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. గత పాలకులకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. వీఆర్‌ఓలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించారు.

– భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ వీఆర్‌ఓల సంఘం

వీఆర్‌ఓలకు బాసటగా నిలిచారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీఆర్‌వోలకు బాసటగా నిలిచింది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సమస్యలను పరిష్కరించింది. పదోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది. ఇంతటి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎస్.వెంకటేశ్వరరావు, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు, వీఆర్‌ఓల సంఘం

ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించింది



పెనుమంట్ర మండలం ఆలమూరుకు చెందిన నేను ఓడూరు, భట్లమగుటూరు గ్రామాల్లో 15 సంవత్సరాలు వీఆర్‌ఓగా పనిచేశాను. సీఎం జగన్ పుణ్యమా అని పదోన్నతి పొంది పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– చింతలపూడి మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్, పెరవలి

మా గోడు పట్టించుకున్న ఏకైక సీఎం



రాష్ట్రంలో వీఆర్‌ఓల గోడు పట్టించుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటాం. అన్ని వర్గాలకూ అన్నీ చేస్తున్న సీఎం మాకు న్యాయం చేయక పోతారా అని ఎదురుచూశాం. ఎదురు చూపులకు తెరదించుతూ, మా కలను నిజం చేసిన సీఎంకు ధన్యవాదాలు.

– ఆర్‌పీవీఎస్ శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), ఏలూరు జిల్లా అధ్యక్షుడు, వీఆర్‌ఓల సంఘం

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అగ్ర పీఠం



మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న పుప్పాల, సునీల్

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అగ్రపీఠం వేసిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆదివారం సాయంత్రం ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్‌తో కలిసి వాసుబాబు ప్రారంభించారు. పూళ్లలో రూ.47 లక్షలతో నిర్మించిన సచివాలయం-2, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.60 లక్షలతో అభివృద్ధి చేసిన బావి వీధి చెరువు, ఎంఎం పురంలో జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.20 లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌ను, కల్వర్టులు, సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డి.సుజాత ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి.. అర్హతే ప్రామాణికంగా.. అవినీతికి తావు లేకుండా ఇంటింటికీ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో ఆయనకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని రెండు నెలల్లో చూడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి స్టార్ క్యాంపెయినర్లు లబ్ధిదారులేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రామయ్య, జెడ్పీటీసీ టి.భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



బలివేలో అమావాస్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బలివేలో విజయవంతంగా ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు



బలివే వీధుల్లో బలే రామలింగేశ్వరునికి రథోత్సవం

బలివే (ముసునూరు): బలివేలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఉత్సవాల అధికారి హరిప్రకాష్, ఈవో నల్లూరి సతీష్ కుమార్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి స్వామి వారి రథోత్సవం, ఆదివారం అమావాస్య స్నానాలు, తదనంతరం రాత్రి పవళింపు సేవ, ధ్వజావరోహణ నిర్వహించినట్టు ఆయన చెప్పారు. పితృ దేవతల పిండ ప్రదానాలకు అత్యంత ప్రసిద్ధి చెందిన బలివే తీర్థ క్షేత్రానికి శని, ఆదివారాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చి, తమ్మిలేరులోను, జల్లు స్నానాల వద్ద అమావాస్య స్నానాలాచరించి, స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. ఆదివారం బిందె తీర్థం, బలిహరణ, వసంతోత్సవం, అవభృతం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించినట్టు చెప్పారు. రాత్రి ధ్వజ అవరోహణం చేసి, బలే రామలింగేశ్వర స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సంప్రదాయ సిద్ధంగా పవళింపు సేవ నిర్వహించినట్టు వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ, ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి.వాసు బందోబస్తు నిర్వహించారు.

దిక్కుతోచకే పొత్తుల కోసం వెంపర్లాట

చంద్రబాబు, పవన్‌ల తీరుపై పీవీఎల్ ఎద్దేవా





పెద అమిరం పార్టీ కార్యాలయంలో సిద్ధం సభను లైవ్‌లో వీక్షిస్తున్న పీవీఎల్, పార్టీ శ్రేణులు

కాళ్ల : ×సిద్ధం₹ సభలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షాలను పరుగులు పెట్టిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలంతా వైఎస్ జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయన్నారు. దిక్కుతోచని పరిస్థితిలో చంద్రబాబు, పవన్ పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో ఆదివారం నిర్వహించిన ×సిద్ధం₹ సభను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు పెద అమిరంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం వద్ద స్క్రీన్ ఏర్పాటుచేశారు. నియోజకవర్గ స్థాయి నాయకులతో కలసి ఈ కార్యక్రమాన్ని వీక్షించిన పీవీఎల్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతమంది ఏకమై వచ్చినా, ఎన్ని పార్టీలు జగన్‌కు వ్యతిరేకంగా పనిచేసినా రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్ పక్షానే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

మరో ఐదేళ్లు అవకాశం ఇస్తే...

ఐదేళ్ల పాలనలోనే ప్రజలను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటికి తీసుకొచ్చి పేదరికం లేకుండా చేశారంటే మరో ఐదేళ్లు అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యంగా, విద్య పరంగా దేశంలోనే మొదటి స్థానంలో నిలబెడతారని పీవీఎల్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల కోసం సంక్షేమ పథకాలు వైఎస్ జగన్ అందిస్తే.. అధికారం కోసం పొత్తులతో ప్రజల్లోకి వెళ్లి మరలా ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, పవన్ చూస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఆనాడు పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక నవరత్నాల పేరుతో ప్రజలను అన్ని విధాలా ఆదుకున్నారన్న విషయం ప్రజలే బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ప్రజలంతా ఆర్థికంగా, ఆరోగ్యంగా ఎంతో ఆనందంగా ఉన్నారని స్పష్టం చేశారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్ కుటుంబానికే దక్కుతుందన్నారు.

మళ్లీ మోసం చేసేందుకే బాబు హామీలు...

ఆనాడు చంద్రబాబు పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన సంగతి ఎవరూ మర్చిపోలేదని పీవీఎల్ గుర్తు చేశారు. మరలా తగుదునమ్మా అంటూ అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు అండ్ పార్టీ సిద్ధమవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు అమాయకులు కాదని, ఎవరి పాలనలో సంక్షేమ పథకాలు పొందుతూ సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారో వారికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. రాబోయేది సంక్షేమ పాలన అని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని నాయకులకు స్పష్టం చేశారు. ఆదివారం జరుగుతున్న సిద్ధం సభతో రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారని రుజువైందన్నారు. సిద్ధం సభలకు వస్తున్న జనాన్ని చూస్తుంటే వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించడం ఖాయమని నమ్మకం కలుగుతోందని చెప్పారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

TO - LET

ToLet : For Students / Bachelor's Enamadala, 3km from Nuzvid on Main Road. Ph : 95158 77494 [V-2435]

Services

GOLD FINANCE

బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824357]

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2505]

Wanted

తుని, రాజమండ్రి, ప్ర॥కం॥ స్టార్ హోటల్స్, షోరూమ్స్, ATM's - నందు సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూపర్వైజర్స్ కావలెను. జీ॥ 12వేలు to 15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 [R-358]

నిడదవోలులో ఇంటిలోనే ఉండి ఇంటిపని, వంటపని చేయుటకు స్త్రీ కావలెను. ఆకర్షణీయమైన జీతం + భోజనం + ఫ్రీ రూమ్ క్రైస్తవులకు ప్రాధాన్యత. ✆ : 99856 86081 [R-6490]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233878]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. Ph: 9160900024/9640400073 [HA-1320]

కస్టర్లైఫ్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 7995365999. [HA-1334]

డ్వాక్రా మహిళలకు నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్, తయరు చేసినవి తీసుకొనబడును. గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. 9491995565 [H-787808]

భీమవరంలో చిన్న కిరాణా షాప్‌లో పని చేయుటకు వర్కర్స్ కావలెను. అనుభవం గల వారికి ఎక్కువ, అనుభవం లేని వారికి 8000. టైమింగ్స్ : 9AM to 8.30PM. Ph: 9849887842 [HA-1345]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాండ్ బాజా బారాత్

- బ్యాగ్ పైప్ బ్యాండ్‌లో తాడేపల్లిగూడెం గురుకుల విద్యార్థుల ప్రతిభ
- ఐదేళ్లలో నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ
- తొలి బ్యాచ్‌తోనే రాష్ట్ర స్థాయి గుర్తింపు
- రెండు సార్లు జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

ప్రత్యేక వేషధారణ.. చేతిలో నాలుగు పైపులతో వాయిద్యం.. దాని నుంచి వెలువడే స్వరానికి తాళం వేస్తూ డ్రమ్ముల శబ్దం.. శ్రావ్యమైన సంగీతం అందిస్తూనే లయబద్ధంగా వాయిద్యకారులు చేసే విన్యాసాలు స్కాట్ ల్యాండ్ బ్యాగ్‌పైప్ బ్యాండ్ ప్రత్యేకత. ఆద్యంతం క్రమశిక్షణ ఉట్టిపడే ఈ బ్యాగ్ పైప్ బ్యాండ్‌లో పట్టు సాధించారు. జిల్లాస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతిభ చూపారు.. ప్రముఖులతో శభాష్ అనిపించుకున్నారు.. వారే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి (న్యూ ఆరుగొలను)కి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు. ఈ బ్యాగ్ పైప్ బ్యాండ్‌లో ప్రతిభ చూపుతున్న విద్యార్థుల గురించి ఓ సారి తెలుసుకుందాం.

– సాక్షి, భీమవరం



సైడ్ డ్రమ్ముతో విద్యార్థి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల బ్యాగ్‌పైప్ బ్యాండ్ విద్యార్థులు

19వ శతాబ్దంలో బ్రిటీష్ వారి హయాంలో బ్యాగ్ పైప్ బ్యాండ్ దేశానికి పరిచయమైంది. అప్పట్లో అతిథులకు ఆహ్వానం పలికేందుకు ఈ బ్యాగ్ పైప్ బ్యాండ్‌ను వినియోగించేవారు. 12 బ్యాగ్ పైప్‌లు, ఎనిమిది బాస్టం (డ్రమ్ము)లు, రెండు బ్యాక్ డ్రమ్ములు, రెండు షో డ్రమ్ములతో 24 మంది వాయిద్యకారులు ఉంటారు. వారందరినీ నడిపించేందుకు చేతిలో ప్రత్యేకమైన స్టిక్‌తో ఒక మేజర్ ఉంటారు. మేజర్ డైరెక్షన్‌లో మిగిలిన బృందంలోని సభ్యులు క్రమశిక్షణతో ఈ బ్యాండ్ మోగిస్తారు. స్కాట్‌ల్యాండ్‌లో దీనిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఇది స్కాట్‌ల్యాండ్ బ్యాగ్ పైప్ బ్యాండ్‌గా గుర్తింపు పొందింది. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజారావు చొరవతో 2018లో ఇక్కడి విద్యార్థులకు బ్యాగ్‌పైప్ బ్యాండ్ శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ప్రభుత్వం నిధులు రూ.11 లక్షలు, దాతల సహకారంతో అందుకు అవసరమైన దుస్తులు, సామగ్రిని సమకూర్చారు. ఐదేళ్లలో మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా తొలి బ్యాచ్‌తోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సహా అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2020లో స్వాతంత్ర్య దినోత్సవంలో ఇచ్చిన ప్రదర్శనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

సాధించిన విజయాలు

- 2018లో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం
- 2019లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం
- 2021లో రాజంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం
- 2023 నవంబర్‌లో దక్షిణాది రాష్ట్రాలతో కేరళలోని త్రివేండ్రంలో జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో మొదటి స్థానం
- 2023 డిసెంబర్‌లో ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం



క్రమశిక్షణ పెంపొందించేందుకు..



బ్యాగ్‌పైప్ బ్యాండ్ వాయించడం చాలా నైపుణ్యంతో కూడుకున్న పని. మా విద్యార్థులకు ప్రత్యేకంగా నేర్పించాలన్న లక్ష్యంతో రూ.2 లక్షలు పెట్టి సామగ్రి కొనుగోలు చేసి శిక్షణ ప్రారంభించాం. ఆ తర్వాత దాతలు సాయమందించారు. ఈ ప్రభుత్వంలో మంచి ప్రోత్సాహం లభించింది. జాతీయస్థాయిలో మా విద్యార్థులు సత్తా చాటుతూ పాఠశాలకు మంచి గుర్తింపు తెస్తున్నారు.

– బి.రాజారావు, ప్రిన్సిపాల్

చాలా ఆనందంగా ఉంది



బ్యాగ్ పైప్ బ్యాండ్ ద్వారా మా విద్యార్థులకు ఎంతో గుర్తింపు వచ్చింది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత అంకితభావంతో ప్రదర్శనలు ఇస్తూ మరిన్ని పతకాలు సాధించడానికి మేం సిద్ధంగా ఉన్నాము.

– సీహెచ్ రోహిత్, బ్యాండ్ మేజర్

క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం



మాధవరంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో ఆదివారం వలంటీర్లు, గ్రామ నాయకులు సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల రూపంలో ఏదో పథకం కింద లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు అన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, ఎంపీటీసీలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

అత్తిలి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం ఉదయం అత్తిలి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ ఆదివారం విలేకరులకు చెప్పారు. తొలుత గుమ్మంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం అత్తిలిలో రజక కమ్యూనిటీహాలు భవనం 2వ అంతస్తును, బొంతువారిపాలెం నూతన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పైబోయిన కోరారు.

కారుమూరి సేవా సమితి ద్వారా ఆర్థిక సాయం



రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: బాధిత కుటుంబానికి కారుమూరి సేవాసమితి ద్వారా ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల ప్రైవేటు స్థలానికి చెందిన గోడకూలి ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన చిన్నారి చిక్కా విజయలక్ష్మి(5) మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ చిన్నారి తల్లి వేణి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుని క్యాంపు కార్యాలయంలో కలవగా ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. కారుమూరి సేవాసమితి నుంచి రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోశాధికారి కొమ్మోజు రామకృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంచార వైద్యశాల ద్వారా తణుకులోని వివిధ ప్రాంతాల్లోని వృద్ధులకు ఇంటి వద్దనే ఉచిత వైద్యసేవలు అందించారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి తగు ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యులు వేల్పూరుకు చెందిన కేఆర్ చక్రధరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ పెద్దలు రాధమ్మ, నిర్వాహకురాలు చిట్టూరి సుజాత, అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

యలమంచిలి: పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమనే సంగతి ప్రతి ఒక్కరికీ వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం యలమంచిలిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార ఫలితాలను సంపూర్ణ పద్ధతిలో మెరుగుపరుద్దాం అనే నినాదంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆమె కోరారు. దేశాభివృద్ధి చెందాలంటే ఆరోగ్యకరమైన యువతతోనే సాధ్యమన్నారు. యువత ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి కడుపులో ఉన్న సమయం నుంచే బలవర్ధక ఆహారం అందించాలన్నారు. ఈ విషయాన్ని తల్లులందరికీ వివరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహ్మద్ హసీనా, మోహన, తులసి, మంగ, శ్రీదేవి పాల్గొన్నారు.

దేదీప్యమానంగా విద్యాదీవెన

- పేదల అభివృద్ధికి ఉచిత విద్య
- విద్యాదీవెనతో పేదింటి పిల్లలకు ఉన్నత విద్య
- నాలుగున్నరేళ్లలో విద్యాదీవెనకు రూ.4.54 కోట్లు
- జగనన్నకు రుణపడి ఉంటామంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తణుకులో శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖద్వారం

తణుకు అర్బన్: పేదవర్గాల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాలు పొందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి విద్యాదీవెన పథకం ద్వారా అండగా నిలిచింది. పేదింటి కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టాలంటే వారి బిడ్డల చదువే వారి ద్వారా అభివృద్ధికి తోడ్పడుతుందనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మాటలను అక్షరాలా ఆచరణలో పెట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యాదీవెన ద్వారా పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థులకు అందిస్తోంది. ప్రతి ఏడాది త్రైమాసికంగా చదువుకు అయ్యే ఖర్చును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసి ఆ మొత్తాన్ని కళాశాలల్లో చెల్లించే రీతిలో ప్రణాళిక ప్రకారం అమలు చేస్తున్నారు. అంతేకాకుండా హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం వసతి దీవెన పేరుతో ఏడాదికి రూ. 20 వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో పేద విద్యార్థులు సైతం ఇంజనీరింగ్, వైద్యవిద్య, డిగ్రీ తదితర కోర్సులతోపాటు విదేశీవిద్య సైతం అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాలు బాగుపడుతున్నాయి. ఇలా ప్రతి పేదింటిని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి ఈ నాలుగున్నరేళ్ల కాలంలో 5,557 మంది విద్యార్థులకుగాను రూ.4.54,36,314 వారి తల్లుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమచేసింది.

నియోజకవర్గంలో విద్యాదీవెన నాలుగున్నరేళ్లలో ఇలా..

	విద్యార్థులు	నగదు
తణుకు మున్సిపాల్టీ	1793	1,57,49,847
తణుకు	1167	93,18,228
అత్తిలి	1268	1,01,21,457
ఇరగవరం	1329	1,02,46,782

గతంలో రూ. 35 వేలే...

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇంజనీరింగ్, వైద్యవిద్య తదితర కోర్సుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా కేవలం రూ. 35 వేలు మాత్రమే విద్యార్థులకు అందజేసేవారు. ఆయా బ్రాంచ్‌లను బట్టి మిగిలిన మొత్తాన్ని తల్లిదండ్రులు కళాశాలలకు చెల్లించాల్సి వచ్చేది. ఈ కారణంగా పేదింటి పిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలంటే ఆ కుటుంబ యజమాని అప్పులపాలయ్యే పరిస్థితి ఉండేది. ప్రజా సంకల్పయాత్రలో ఈ సమస్య తెలుసుకున్న జగనన్న విద్యాదీవెన పథకాన్ని నవరత్నాల్లో పొందుపరిచారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి కాగానే ఎంత ఫీజు అయినప్పటికీ మొత్తం చెల్లించేలా ఆదేశాలు జారీచేసి అమలు చేస్తున్నారు. దీంతో ఇటు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పనితీరుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా అన్ లిమిటెడ్ విద్య



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ లిమిటెడ్ విద్యను ఉచితంగా అందజేస్తున్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఎంత చదువుకున్నా ఉచితమే అంటూ డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్‌తో పాటు విదేశీ విద్య కూడా ఉచితంగానే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో నివసించడమే అదృష్టంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. – దీజీ అమూల్యారావు, రిటైర్డు ఉపాధ్యాయులు, తణుకు

గతంలో రూ. 35 వేలు మాత్రమే



గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇంజనీరింగ్ విద్యకు ఏడాదికి రూ. 35 వేలు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా అందజేయగా మిగిలిన మొత్తాన్ని తల్లిదండ్రులు కట్టుకోవాల్సి వచ్చేది. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాగానే చదువుకున్నవారికి చదువుకున్నంత విద్య అనే విధంగా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థి తల్లుల బ్యాంకు ఖాతాల్లో వేస్తుండడాన్ని తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. – నత్తా కృష్ణవేణి, తణుకు ఏఎంసీ చైర్మన్

సీఎం జగన్ వల్లే ఉచిత విద్య



అనంతపురంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీలో ఎంటెక్ విద్యలో గోల్డ్‌మెడల్ సాధించాను. నాలాంటి చాలామంది విద్యార్థులను ఉచితంగా చదివించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది. నా ఇంజనీరింగ్ విద్యలో నాకు విద్యాదీవెన, వసతి దీవెన రూపంలో పూర్తి రీయింబర్స్‌మెంట్ దక్కడంతో నాకు ఉన్నత విద్య చదవడానికి దోహదపడింది. నా చదువు కోసం నా తల్లిదండ్రులు చాలా కష్టపడ్డారు. పీజీ మాత్రం జగనన్న సహకారంతో పూర్తిచేశాను. – బొల్లా యోగేశ్వర సత్యసాయి, ఎంటెక్ విద్యార్థి,తణుకు

విద్యాదీవెన ఆదుకుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఉచిత విద్య ద్వారా నేను తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తిచేసి క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం ఫీజు చెల్లించాల్సి వచ్చింది. రెండో సంవత్సరం నుంచి జగనన్న అందించిన విద్యాదీవెనతో ఉచితంగానే విద్యనభ్యసించాను. – రేలంగి రాజ్ దుర్గా మణిమోహన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తణుకు

పెంటపాడులో కవాతు



పెంటపాడులో ఎన్నికల కవాతులో పాల్గొన్న పోలీసులు

పెంటపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికలు పార్టీలకతీతంగా సజావుగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రజల పూర్తి సహకారం ఎంతో అవసరమని ఎస్సై మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడు, అలంపురం కె. పెంటపాడు తదితర గ్రామాల్లో ఎస్సై మోహనరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



పట్టణంలోని బీవీఆర్ నెలవారీ సమాహారం ప్రారంభిస్తున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఆదివారం రాత్రి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీ చైతన్య కళాభారతి వారిచే కైలాసంలో కోర్టు హాస్య నాటికను ప్రదర్శించారు. గౌరవ పురస్కారం తాతా శ్రీనివాస్ గౌడ్‌కు, ఉద్యోగ సేవ పురస్కారం పీఎంకే జ్యోతికి, కళా సేవ పురస్కారం చింతా సూర్యారావుకు, పేద కళాకారుడికు ఆర్థిక సత్కారం అందజేశారు. నిర్వాహకులు బుద్దాల వెంకట రామారావు, సిరిమామిళ్ళ పెద్దిరాజు, ఎస్‌వీ రమణారావు, కళాకారులు, సాహితీ ప్రముఖులు, ప్రజలు హాజరయ్యారు.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ చరిత్రాత్మకం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తణుకు అర్బన్ : పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా ఒక ఆస్తి రూపంలో రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను అందించడం చరిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆదివారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను మంత్రి కారుమూరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనైనా కేవలం ఇళ్ల పట్టాలను మాత్రమే ఇచ్చేవారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు అందచేసి చరిత్రలో నిలిచారని అన్నారు. ఏరు దాటాక తెప్పతగలేసే చంద్రబాబు ఇంటి స్థలాన్ని డాక్యుమెంట్‌లుగా ఇవ్వడాన్ని కూడా అడ్డుకోవాలని ప్రయత్నించారని కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఆయన పప్పులు ఉడకవని స్పష్టం చేశారు. ఇంటి స్థలాల పంపిణీ విషయంలో ఓర్వలేకపోయిన టీడీపీ నాయకులు నానా యాగీ చేశారని, కానీ ప్రజల నుంచి కూడా తిరుగుబాటు రావడంతో తోకముడిచారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, రేలంగి, కొమరవరం సర్పంచ్‌లు చేబ్రోలు స్వరాజ్యం, కరిబండి రాజేష్, తణుకు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లి సూరిబాబు, ద్వారకాతిరుమల దేవస్థానం కమిటీ మాజీ సభ్యుడు కంకటాల సతీష్, తణుకు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షురాలు ఫహీమా పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలే జీవితం స్ఫూర్తిదాయకం



సావిత్రిబాయి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తణుకు అర్బన్: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవన విధానం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్య ప్రాధాన్యతను మహిళా లోకానికి తెలిపి మహిళలను విద్యబాట పట్టేలా చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ విద్యతోనే మహిళలు అభివృద్ధి చెందుతారనే విషయాన్ని లోకానికి చాటిచెప్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలేనని, ఆమె కారణంగా నేడు పురుషులతో సమానంగా మహిళలు ఆర్థిక వనరులను అందిపుచ్చుకోగలుగుతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, తణుకు బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లి సూరిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, కుడుపూటి చంద్రరావు, గెద్దాడ శ్రీకాంత్, దోలా సింహాద్రి, చింతన్న, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శక్తీశ్వరుని తెప్పోత్సవం



యనమదుర్రులో హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీ పార్వతీ సమేత శక్తీశ్వర స్వామి

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శక్తీశ్వరుని ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శక్తిగుండం హంస వాహనంపై స్వామివార్లు వైభవంగా ఊరేగారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల సత్యనారాయణ, కొండమంచిలి తమ్మిరాజు శక్తీశ్వరస్వామికి సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు సామూహికంగా గౌరి, విఘ్నేశ, శని దేవతలకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదురుగా ఉన్న శక్తిగుండం ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామివార్లు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, తులా రాంబాబు, యడ్లపల్లి లక్ష్మణస్వామి, బూరాబత్తుల సిరి లక్ష్మి, కంతేటి మొగళ్లమ్మ, కొల్లాటి పెన్నమ్మ, దేవాబత్తుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత విద్యాంసులను సన్మానిస్తున్న తల్లాప్రగడ శ్రీనివాస్ తదితరులు

పెంటపాడు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని రావిపాడు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన సంగీత కచేరీ ప్రేక్షకులను అలరించింది. సంగీత విద్వాంసురాలు, గాయని కె.ఉమ, అంతర్జాతీయ మృదంగ విద్యాంసులు బ్రహ్మశ్రీ సరస్వతుల హనుమంతరావు, వయోలిన్ విద్యాంసులు ఆంజేయశాస్త్రి, తిరుపతికి చెందిన మూర్సింగ్ విద్యాంసులు ఎల్.ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కచేరీ వీనుల విందుగా సాగింది. తాళ్లపాక అన్నమయ్య, పురందదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ చైర్మన్ తల్లాప్రగడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యాంసులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నాడ రాఘవ, పూడి శ్రీనివాస్, కాజులూరి దుర్గామల్లేశ్, పాపా నాగేశ్వరరావు, శివాజి తదితరులు పాల్గొన్నారు.

13న మెగా జాబ్‌మేళా

పెంటపాడు: స్థానిక డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్. ఇందిరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో ఫార్మా, హెటిరోలాబ్స్, ఆస్ట్రోటెక్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ చదివిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రార్థించండి



మహిళలకు నమస్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: 'దండం పెట్టి చెబుతున్నా... మళ్లీ మళ్లీ జగన్ పథకాలు రావాలని, కావాలని కోరుకోండి. మీ జీవితాలు సుఖంగా సాగిపోవాలంటే జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని భగవంతుడ్ని ప్రార్థించండి' అంటూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మహిళలను కోరారు. మండలంలోని నందమిల్లిపాడులో శనివారం జరిగిన మహిళా సదస్సులో అధిక శాతం పాల్గొన్న మహిళలకు ఆయన అభివాదం చేశారు. రెండు చేతులూ జోడించి మహిళలందరికీ విజ్ఞప్తి చేశారు. జగన్ ఐదేళ్ల పాలన మహిళామణులదేనన్నారు. అన్ని పథకాలు మహిళల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. జగన్ బటన్ నొక్కితే మహిళ ఖాతాలో సొమ్ము జమైనట్లేనని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ, ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధిపొందారని చెప్పారు. ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి మార్గమని, నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి చెందితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని జగన్ భావించినందునే మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పీవీఎల్ చెప్పారు.

వడలిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పెనుగొండ: ప్రస్తుతం ట్విట్టర్, ఫేస్‌బుక్‌లను ఏవిధంగా వినియోగించుకుంటున్నామో, అదేవిధంగా భాషను సరిగా ఉపయోగించుకోవాలని లేదంటే ఇబ్బందులు తప్పవని విశ్వతేజ తెలుగు అధ్యాపకుడు వి.తీష్ అన్నారు. ఆదివారం వడలిలో ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు భాషపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవను అలవర్చుకొని వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్ఎన్ శ్రీనివాస్, వి.వీరయ్య, టి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మంచినీటి సరఫరాపై సమీక్ష

నరసాపురం: వేసవిలో గ్రామాల్లో ఎక్కడా మంచినీటి ఎద్దడి సమస్య రాకూడదని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం ముదునూరి తన కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక తయారు చేయాలన్నారు. కాలువలు కట్టేసిన వెంటనే యాక్షన్‌ప్లాన్ అమల్లో పెట్టాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాలువలు కట్టేసే లోపు ముందుగా అన్ని ప్రాంతాల్లో మంచినీటి చెరువులు నింపాలని సూచించారు. మంచినీటి ప్రాజెక్టులకు సంబంధించి అవసరమైన చోట్ల మరమ్మతులు ఉంటే గుర్తించి వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులు కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులను వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి



భీమవరంలో విక్టర్ ప్రసాద్, దళిత నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. భీమవరంలో ఆదివారం ఏర్పాటు చేసిన దళిత గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దళితులపై దాడులు ఎక్కడ జరిగినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో శ్మశాన భూమి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్, దళిత నాయకులను సత్కరించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్ బొమ్మ, బుధవారం మార్కెట్, వీరమ్మ పార్క్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, తెలంగాణ అధ్యక్షుడు మన్నే శ్రీధర్ రావు, కొమ్మతోటి పౌలు, బురుగుల వెంకటేశ్వరరావు, గోపిజి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సమాఖ్య ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు



ప్రశ్నపత్రాలు అందిస్తున్న విద్యా చైతన్య సమాఖ్య ప్రతినిధులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ నిరంతరం కష్టపడితేనే అనుకున్న ఆశయం సాధించగలమని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కష్టపడుతూ ఉంటే ఏదో ఒకరోజు తప్పనిసరిగా ఫలితం మన చెంతకే చేరుకుంటుందన్నారు. చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పరీక్షకు సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పాలకొల్లు డివిజన్ పరిధిలో గల పాలకొల్లు పట్టణం, మండలం, యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 7, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్ష అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. పనస శ్రీనివాస్, మంచెం హేమ నాగకృష్ణ సాహితీష్, బర్ల త్రినాథ్ స్మారకంగా ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, చేగొండి కరుణకుమార్ పాల్గొన్నారు.

